క్లుప్తంగా

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ అందజేత


స్పోర్ట్స్ కిట్‌ను అందజేస్తున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామానికి చెందిన యువకులకు ఆ గ్రామ సర్పంచ్ జగదాంబమాణయ్య, ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి కేసీఆర్ స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారన్నారు. అలాంటి యువకులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిల్ప తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ చేపట్టాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులు, ఖర్చుల వివరాలు రాబట్టేందుకు సామాజిక తనిఖీ చేపట్టాలని ఎస్ఆర్‌పీ కొండలు అన్నారు. కల్హేర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డీఆర్‌పీలు, వీఎస్ఏలు, ఉపాధిహామీ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులు, లోపాలు గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఏపీఓలు నర్సింహులు, వేణుమాధవ్ పాల్గొన్నారు.

మగ్గంవర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: మగ్గంవర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు ఎస్బీఐ ఐఆర్‌ఎటీ డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డిలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఈ నెల 26 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. నెలరోజుల పాటు గ్రామీణ మహిళలకు మగ్గంవర్క్‌లో ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి కల్పిస్తామన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి సర్టిఫికెట్లతో జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9704446956, 9490129839 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు వాలీబాల్ పోటీలు

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలో అంబేడ్కర్ సంఘం అధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నర్సింహులు, రాములు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపన్ టూ ఆల్ వాలీబాల్ పోటీల్లో 41 జట్లు పాల్గొంటాయన్నారు. 22న గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.30,000, ద్వితీయ బహుమతి రూ.15,000 నిర్ణయించినట్లు తెలిపారు.

వరుస చోరీలతో రైతుల ఆందోళన

నారాయణఖేడ్: పట్టణంతో పాటు పరిసర గ్రామాల శివారుల్లోని వ్యవసాయ, ఇళ్ల బోర్లకు సంబంధించి కొద్దిరోజులుగా రాత్రి సమయాల్లో కేబుల్‌వైర్లు చోరీకి గురవుతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్ చౌక్ వద్ద నిర్మాణంలో ఉన్న కాలనీలకు సంబంధించి పలుబోర్ల నుంచి రెండు నెలల్లో దాదాపు 15 బోర్లకు సంబంధించి కేబుల్‌వైర్లు చోరీకి గురయ్యాయని బాధితులు వాపోయారు. కేబుల్ వైర్లలో రాగి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని చోరీ చేసి విక్రయించుకుంటున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వెంటనే స్పందించి చోరీల నివారణపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గాడ్గె బాబాకు నివాళి


నివాళులు అర్పిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: భారతదేశంలో మొదటి స్వచ్ఛ భారత్ పితామహుడు శ్రీసంత్ గాడ్గె బాబా 67వ వర్ధంతిని ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.అంబేడ్కర్, పూలే సేవాసమితి, అంబేడ్కర్ సంఘం, రజక సంఘం బాధ్యులు అబ్దుల్‌రహీం, పండరి, గౌతం సిద్దు, భీంసేన, ప్రశాంత్, రాజుపటేల్, తుకారాం, సంజయ్‌రామల్, బస్వరాజ్, దేవరాజ్ పాల్గొన్నారు.

గాడ్గే బాబా ఆశయ సాధనకు కృషి చేయాలి

సంగారెడ్డి టౌన్: సంత్ గాడ్గే బాబా ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రజక సంఘం సమితి అధ్యక్షుడు నామాల నాగేష్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద గాడ్గె బాబా చిత్రపటానికి నివాళి అర్పించారు. వైద్యనాథ్, కునా వేణు, శ్రీధర్ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి
- గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సుష్మశ్రీ


మాట్లాడుతున్న ఎంపీపీ సుష్మశ్రీ

పటాన్‌చెరు టౌన్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎంపీపీ సుష్మశ్రీ అన్నారు. సుష్మశ్రీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి జెడ్పీటీసీ సుప్రజ, ఎంపీడీవో బన్సిలాల్, తహసీల్దార్ భాస్కర్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విడతలవారీగా పరిష్కరించేందుకు సమన్వయంతో ముందుకెళ్దామని వివరించారు.

సభాదృష్టికి సభ్యులు తీసుకువచ్చిన సమస్యలు..

- గణపతిగూడెం, ఆల్విన్‌కాలనీ, బచ్చగూడెం ప్రభుత్వ పాఠశాల్లో మర్మతులు చేపట్టాలని కర్ధనూర్ ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు ఉన్నాయని సర్పంచ్ భాగ్యలక్ష్మి విద్యాధికారి దృష్టికి తీసుకువచ్చారు.
- ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిధులు రాలేవని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు ఉపాధ్యాయుల కొరత ఉందని ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం ఎంఈఓ రాథోడ్ దృష్టికి తీసుకువచ్చారు. రుద్రారం ప్రభుత్వ పాఠశాలకు టీచర్ కేటాయించాలని, పెద్దకంజర్ల ప్రభుత్వ పాఠశాల భవనం మంజూరు చేయాలని సభాదృష్టికి తెచ్చారు.
- కరోనాతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, జలుబు ఎక్కువ రోజులు ఉంటే వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలని వైద్యాధికారులు సూచించారు.
- పెద్దకంజర్ల రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆ గ్రామ సర్పంచ్ రాజు అన్నారు. కర్ధనూరు నుంచి పాశమైలారం వెళ్లే రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయని సర్పంచ్ భాగ్యలక్ష్మి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. లక్డారం జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, గుంతలు పూడ్చాలని ఇస్నాపూర్ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం కోరారు.
- ఇంద్రేశం అంగన్‌వాడీ కేంద్రానికి ఆయాని కేటాయించాలని సర్పంచ్ నర్సింహులు ఐసీడీఎస్ అధికారులను కోరారు. దీంతో స్పందించిన అధికారులు పటాన్‌చెరు పరిధిలో 10 సెంటర్లలో ఆయాలులేరని నోటిఫికేషన్ రాగానే ఆ స్థానాలను భర్తీ చేస్తామని హామీనిచ్చారు.
- లోవోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పెద్దకంజర్ల సర్పంచ్ రాజు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పోచారంలో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని, ఇంద్రేశంలో ఎస్సీ కాలనీలో పోల్స్ వేయాలని, ముత్తంగిలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె వేయాలని ప్రజాప్రతినిధులు విద్యుత్‌శాఖ అధికారులను కోరారు.
- రుద్రారంలో పరిశ్రమల నుంచి ఉదయం, అర్ధరాత్రి పొగ వదులుతున్నారని, దీంతో దుర్వాసన వెదజల్లుతోందని ఎంపీటీసీ బీసీపీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
- గ్రామాల్లో బెల్ట్‌షాపులు పెరిగాయని, వైన్‌షాప్‌లో ఏర్పాటు చేసిన పర్మిట్ రూంలో కాకుండా జాతీయ రహదారిపై కూర్చొని బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండటంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ శ్రీశైలం ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ రాములు దృష్టికి తీసుకువచ్చారు. కంజర్ల గ్రామంలో మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ వెనుకాల బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్నారన్నారు. ఆ గ్రామ సర్పంచ్ రాజు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.
- ఇస్నాపూర్ 496 సర్వేనెంబర్‌లోని 35 ఎకరాల భూమిని గ్రామపంచాయతీకి తెలియకుండా హెచ్ఎండీఏ వారికి కేటాయించారని, దీంతో గ్రామ అవసరానికి స్థలం లేకుండా పోయిందని ఆ గ్రామ ఎంపీటీసీలు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ముత్తంగి గ్రామంలో ఉన్న బఫర్‌జోన్‌లో నిర్మాణాలు జరిగాయని, వాటికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ గ్రామ ఎంపీటీసీ డిమాండ్ చేస్తూ విచారణ చేపట్టాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామానాయుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్ఐ రామానాయుడు అన్నారు. జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం సైబర్ నేరాలు–తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం అనేక మంది సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన కాల్స్, మెసేజ్‌లు పంపుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారి పట్ల విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామని, బ్యాంక్ ఖాతా వివరాలను చెప్పాలని సైబర్ నేరగాళ్లు అడుగుతారని, దీంతో ఎటువంటి సమాచారం చెప్పవద్దన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, 18 ఏళ్లు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపడమే కాకుండా జరిమానా విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, సంగీత, జ్యోతి, కల్పన, ఓంకార్ స్వామి, సరిత, రవిందర్ పాల్గొన్నారు.

జనవరి 12న చలో పార్లమెంట్


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి అర్బన్: అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో వచ్చే నెల 12న 16 విద్యార్థి సంఘాలతో కలిసి చలో పార్లమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ.జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల వద్ద ఐటీఐ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చలో పార్లమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ విద్యా విధానంతో విద్యార్థులకు ఒరిగేది ఏం లేదని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు జనవరి 12న నిర్వహించనున్న చలో పార్లమెంట్ కార్యక్రమానికి విద్యార్థులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

23న వైకుంఠ ఏకాదశి వేడుకలు


మాట్లాడుతున్న ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు

సంగారెడ్డి టౌన్: పట్టణ శివారులోని వైకుంఠపురంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ఈ నెల 23న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొంటారని వారికి తగిన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అరుణ, మధుసూదన్, దేవేందర్, యశ్వంత్, సంతోష్ వీరేందర్ పాల్గొన్నారు.

ఘనంగా మంథన్ స్కూల్ వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సుజిత్‌సింగ్ మాట్లాడుతూ తమ పాఠశాల 21 దేశాలలో 77 బ్రాంచ్‌లు కలిగి ఉందన్నారు. నాలుగు రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో 1850 మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. సామాజిక అవగాహన, బాధ్యతగల పౌరులను నిర్మించాలన్న ధ్యేయంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు, విద్యార్థులను ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు.

నియామకం


నర్సింహులు

జహీరాబాద్ టౌన్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జహీరాబాద్‌కు చెందిన కొండపురం నర్సింహులు నియమితులయ్యారు సంగారెడ్డిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం నర్సింహులు మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తనకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చిన అధ్యక్షుడు శ్రీనివాస్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేతకీ ఆలయం హుండీ లెక్కింపు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలల పాటు వివిధ ప్రాంతాల భక్తులు స్వామివారికి సమర్పించిన నగదును లెక్కించగా రూ.36,92,873 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శశిధర్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికులతో ముఖాముఖీ

సంగారెడ్డి టౌన్: మాజీ సైనికుల ముఖాముఖి సమావేశాన్ని ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి సత్యశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఖమ్మం జిల్లా నుంచి మాజీ సైనికులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు మద్రాస్ నుంచి అధికారులు వస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మాజీ సైనికులు వినియోగించుకోవాలని సూచించారు.

మల్గిలో కొనసాగుతున్న మల్లికార్జునస్వామి ఉత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడవ రోజైన బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో భజన మండలి ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచే కాకుండా సమీపాన ఉన్న కర్నాటక ప్రాంతం నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు యుద్ధ వాహనాల పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్ పెద్ద చెరువులో ఎద్దు మైలారంలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారు చేసిన నూతన యుద్ధ వాహనాలను గురువారం ఆర్మీ అధికారులు పరీక్షించనున్నట్లు ఫ్యాక్టరీ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో స్వదేశీ సాంకేతికతో తయారుచేసిన బీఎంపీ–2, 2కే, సీఎంటీ, ఏవీఆర్‌వీ, ఏఏటీ, సీసీపీటీ, ఎఫ్‌బీసీఆర్‌బీ తదితర వాహనాలకు ఫ్లొటేషన్ ట్రయల్స్ నిర్వహిస్తారు. పరీక్షల అనంతరం ఈ యుద్ధ వాహనాలు దేశం నలుమూలల సైన్యం అవసరాలకు ఉయోగించనున్నట్లు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అధికారులు వెల్లడించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జహీరాబాద్ టౌన్: ఎల్ఐసీ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర్, అశోక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ క్లాస్‌వన్ ఆఫీసర్స్ ఫెడరేషన్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం దేశవ్యాప్త నిరసనలో భాగంగా జహీరాబాద్ ఎల్ఐసీ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసీలో అన్ని రకాల ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, నూతన పెన్షన్ స్కీం కింద 10 నుంచి 14 శాతానికి కాంట్రిబ్యూషన్ పెంచాలన్నారు. వేతన సవరణ కోసం వెంటనే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జమున, నర్సింహులు, చంటి, మోహన్, వెంకట్‌రామన్, క్లాస్‌వన్ ఆఫీసర్ శ్రీనివాస్‌శాస్త్రీ, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటు


మహనీయుల విగ్రహాల ఎదుట గ్రామస్తులు

కోహీర్(జహీరాబాద్): రాజకీయ గ్రహణం వీడి ఎట్టకేలకు మండలంలోని రాజనెల్లి గ్రామంలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ మగ్గపల్లి అచ్చమ్మ ఆధ్వర్యంలో ఒక వర్గంవారు అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. విగ్రహాలు కొనుగోలు చేసి ప్రతిష్ఠించడానికి వీలుగా గద్దె నిర్మించారు. అయితే గ్రామానికి చెందిన మరో వర్గంవారు విగ్రహాల ఏర్పాటును అడ్డుకున్నారు. అయితే బుధవారం ఎస్ఐ విఠల్ జోక్యం చేసుకొని ఇరువర్గాలకు నచ్చచెప్పి సయోధ్య కుదిర్చారు. సర్పంచ్ లచ్చమ్మ, పలువురు వార్డుసభ్యుల ఆధ్వర్యంలో విగ్రహాలను గద్దెపై ప్రతిష్ఠించారు. త్వరలో విగ్రహా ఆవిష్కరణ చేస్తామని సర్పంచ్ తెలిపారు.

విద్యార్థులకు దంత పరీక్షలు


దంత పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు భవ్య

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలను బుధవారం నిర్వహించారు. జహీరాబాద్ రోటరీ క్లబ్ సహకారంతో జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ భవ్య విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి పలు సూచనలు సలహాలు అందించారు. అనంతరం విద్యార్థులకు పేస్టు, టూత్ బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు సంగ్రామ్ పాటిల్, ఉపాధ్యాయులు నాగేష్, సంగమేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ రత్నమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: చెత్త సేకరించే పారిశుద్య కార్మికులు సమయపాలన పాటిస్తూ ఆయా కాలనీలో ఇంటింటికి తిరిగి సకాలంలో చెత్తను సేకరించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలో బుధవారం పారిశుద్య కార్మికుల పనితీరును పరిశీలించారు. ఇళ్లల్లో చెత్త తొలగింపు విషయంలో ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. చెత్త సేకరణ చేసే వాళ్లంతా తప్పకుండా తమకు కేటాయించిన కాలనీలలో సమయపాలన పాటిస్తూ, ప్రతి గృహంలో ఖచ్చితంగా చెత్తను సేకరించాలని సూచించారు. కార్మికులకు ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని హంగిర్గా(కె) మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు యూత్‌ఫర్‌సేవ, ఎన్‌టీటీ డాటా సాఫ్ట్‌వేర్ సంస్థల డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ సౌజన్యంతో 100మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, జామెట్రి బాక్సులు, బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. విద్యా సామగ్రిని పంపిణీ చేసినందుకు గాను ఉపాధ్యాయులు, విద్యార్థులు తిప్పరాజు ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సుభాష్‌గంజ్ మార్కెట్లో మేకల బెడద

- తలలు పట్టుకుంటున్న వ్యాపారులు
- గుంపులుగా సంచరిస్తూ దుకాణాలపై దాడి
- మేకల బెడద నివారించాలని విన్నపం


జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో సంచరిస్తున్న మేకలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో వ్యాపారులకు కొత్త సమస్య వచ్చి పడింది. వీధికుక్కల బెడద సాధారణంగా ఉంటుంది. కానీ.. గ్రీన్ మార్కెంట్‌లోని వ్యాపారులకు మేకల బెడద వెంటాడుతోంది. మేకలు గుంపులు గుంపులుగా వచ్చి దుకాణాలపై దాడి చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. పదుల సంఖ్యలో మేకలు సుభాష్‌గంజ్ ప్రాంతంలో సంచరిస్తూ దుకాణాల ముందు అమ్మకానికి ఉంచిన ధాన్యాన్ని తింటున్నాయి. దీంతో వ్యాపారులకు ఎం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. ఒకే దగ్గర బియ్యం, గోధుమలు, జొన్న తదితర పప్పుధాన్యాలు లభిస్తాయి. దుకాణాలన్ని ఒకేచోట ఉండటంతో కొనగోలుదారులు ఇక్కడికే వస్తుంటారు. వ్యాపారులు ధాన్యం పప్పులను అమ్మేందుకు బస్తాలో దుకాణాల ముందు ఉంచుతుంటారు. గుంపులు గుంపులుగా వచ్చిన మేకలు దుకాణాలపై దాడిచేసి ధన్యం తింటున్నాయి. మేకలను తరిమేసినా మళ్లీ తిరిగివస్తున్నాయి. మేకల యజమానులు వాటిని విచ్చలవిడిగా వదలేయడంతో గంజ్‌లో సంచరిస్తున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మేకల బెడదను నివారించాలని కోరుతున్నారు.

ఆలు పంటలో అంతర కృషి పనులు

జహీరాబాద్: నవంబర్ రెండో వారంలో సాగుచేసిన ఆలుగడ్డ పంటలో రైతులు అంతర కృషి పనులు చేస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఈ ఏడాది రైతులు విస్తారంగా ఆలుగడ్డ పంటను సాగు చేసుకున్నారు. అక్టోబర్ మొదటి వారం నుంచి నవంబర్ నెలాఖరు వరకు పంటను వేశారు. అక్టోబర్‌లో వేసిన పంట చేతికి అంది వస్తుండగా నవంబర్ నెలాఖరులో సాగు చేసిన పంట మాత్రం ఫిబ్రవరి మొదటి వారంలో చేతికి రానుంది. అక్టోబర్‌లో వేసుకున్న పంటలకు తెగుళ్లు సోకడంతో దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఆలస్యంగా వేసుకున్న పంటలు మాత్రం ఆశాజనకంగా ఉన్నాయన్నారు. పంట సాగుకు వాతావరణం అనుకూలంగా లేదంటున్నారు. ఏది ఏమైనా ఆలు సాగు కోసం రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్నారు.